భారీ మెజార్టీతో బీజేపీ విజయం ఖాయం



ఫ్లెజెంట్ వ్యాలీ కాలనీలో ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

మణికొండ: చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఈనెల 13న జరిగే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుస్తారని ప్రజల్లో మంచి ఆదరణ ఉందని, మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె. నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్‌నగర్, చైతన్య కాలనీ, ఫ్లెజెంట్ వ్యాలీ కాలనీ, శ్రీనివాస్‌నగర్ కాలనీలలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సి.బీరప్ప ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో బీజేపీ గాలి వీస్తుందని, వచ్చే పార్లమెంట్‌లో 400కు పైగా ఎంపీ స్థానాలను గెలుపొంది సమర్థవంతమైన ప్రభుత్వం కేంద్రంలో వస్తుందన్నారు. ఇప్పటికే జరిగిన మూడు విడతల ఎన్నికల్లో మెజార్టీ సీట్లు బీజేపీకి వస్తాయని పలు సర్వేలు చెప్పాయన్నారు. రాష్ట్రంలోనూ చేవెళ్లతో పాటు మరో 11 స్థానాలు గెలవటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నీతివంతమైన పాలన, దేశభద్రత, ప్రపంచానికి విశ్వగురువుగా ఎదగడం, భారత్ అతిపెద్ద మూడో ఆర్థిక వ్యవస్థగా నిలిపి, శత్రు దేశాల గుండెల్లో రైళ్లు పరుగెత్తించేందుకు బీజేపీకి ఓటు వేయాలని కోరారు. నాయకులు రాఘవరెడ్డి, వేణుకుమార్, లక్ష్మీరాములు, ఆనంద్‌రావు, అనితాదేవి, నర్సయ్యచారి, దిలిప్‌కక్కడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



మాధవి (ఫైల్)

శంషాబాద్ రూరల్: మహిళ ఇంటి నుంచి అదృశ్యమైన ఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లి గ్రామానికి చెందిన సంపంగి ప్రవీణ్ భార్య మాధవి (32) కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం నిద్రకు ఉపక్రమించింది. తెల్లవారు జామున ఆమె ఇంట్లో కనిపించలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో వారు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి బూత్‌లో మెజార్టీ రావాలి

● కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి



కాంగ్రెస్ నేతలతో ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి

మణికొండ: గండిపేట మండల పరిధిలోని ప్రతి పోలింగ్ బూత్‌లో ఎంపీ ఎన్నికల్లో మెజార్టీ ఓట్లు సాధించేలా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం కోకాపేట్‌లోని పార్టీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి కార్యాలయంలో రాష్ట్ర మైనార్టీ ఎడ్యుకేషన్ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ ఫహిముద్దీన్ ఖురేషి, పాడి పరిశ్రమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌లతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో కలిసికట్టుగా కృషిచేసి ఓటింగ్ శాతం పెంచడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు, ఎంపీ అభ్యర్థులు గెలవాల్సిన అవసరాన్ని వివరించాలన్నారు. ప్రచారానికి మిగిలి ఉన్న రెండు మూడు రోజులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో బృందాలుగా ఏర్పడి ఇంటింటి ప్రచారం నిర్వహించాలనే గెలుపే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, కౌన్సిలర్‌లు విజయ్‌బాబు, దుర్గేష్‌యాదవ్, అమరేందర్‌రెడ్డి, నరేష్, శివారెడ్డి, నాయకులు మైలారం శ్రీనివాస్, కిరణ్‌కుమార్, డి.కిరణ్, సాయిరెడ్డి, వేణుగౌడ్, ఓంప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

అత్తాపూర్: కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు సమన్యాయం జరుగుతుందని డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్‌రెడ్డి, సంఘ సేవకులు బోయ రమేష్ అ న్నారు. అత్తాపూర్ డివిజన్‌లో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పా ర్టీ అభ్యర్థి ఎంపీ రంజిత్‌రెడ్డికి మద్దతుగా అత్తాపూర్ డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించి హస్తం గుర్తుకు ఓటువేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీతోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. ప్రజలు బీజేపీ, బీఆర్‌ఎస్ మోసపూరిత మాటలను నమ్మి ఓటు వేయకూడదన్నారు. పేద ప్రజలకు ఆరు గ్యారంటీలను అందజేస్తామని తెలిపారు. నాగరాజు, మారుతి, ప్రశాంత్ తదితరులున్నారు.

అత్తాపూర్ డివిజన్ పరిధిలలోని మారుతినగర్‌లో కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు పథకం, 200యూనిట్స్ ఉచిత కరెంట్ జీరో బిల్లు రావడంపై ప్రజలు హర్షిస్తున్నారన్నారు. బోయ రమేష్, నాగరాజు, మారుతినగర్ మహిళలు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్స్ పంపిణీ చేస్తూ..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్‌పల్లి, యాదవరెడ్డి, గాంధీనగర్, శాంతినగర్‌లో ఓటర్ స్లిప్పులు గడపగడపకు నేరుగా ఓటర్లతో మమేకమవుతూ.. బ్యాలెట్ నమూనా చూపుతూ..



క్రమసంఖ్య నంబర్ 3 చేతి గుర్తుకు ఓటువేసి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి, డివిజన్ కో–ఆర్డినేటర్ పలుగుచెరువు మహేష్ పాల్గొన్నారు.

బండ్లగూడలో..



కార్పొరేటర్ లతాప్రేమ్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్ కార్పొరేటర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. బుధవారం ఇంటింటికి తిరుగుతూ.. కరపత్రాలను పంపిణీ చేశారు. చేతి గుర్తుకు ఓటు వేసి అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఆమె మాట్లాడుతూ.. ప్రజల్లో ఉండే నాయకుడికి ప్రజలు పట్టం కట్టాలని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను సీఎం రేవంత్‌రెడ్డి పక్కాగా అమలు చేస్తున్నారన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో..



వాంబే కాలనీలో ప్రచారం చేస్తున్న ఇంద్రపాల్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని మనస్ఫూర్తిగా ఓటు వేసి గెలిపించాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ కో– ఆర్డినేటర్ సామ ఇంద్రపాల్‌రెడ్డి ప్రజలను కోరారు. బుధవారం ఉదయం, సాయంత్రం కాలనీలలో కార్యకర్తలతో కలిసి ఆయన చేతి గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ప్రజల నుండి విశేష స్పందన వస్తుందని పేర్కొన్నారు. మరో వైపు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్ ధనంజయ్ ఆధ్వర్యంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని బృందావన్ కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. సానెం జీవన్‌గౌడ్, అడికె అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేయసితో ఫోన్‌లో గొడవపడి..

యువకుడి ఆత్మహత్య



ఇమ్రోస్ పటేల్ (ఫైల్)

రాజేంద్రనగర్: ప్రేయసితో సెల్‌ఫోన్‌లో గొడవపడి ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మౌనిక తెలిపిన వివరాల ప్రకారం... తాండూరు ప్రాంతానికి చెందిన ఇమ్రోస్ పటేల్ (29) ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఉప్పర్‌పల్లి పర్మారెడ్డి హిల్స్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి యువతితో సెల్‌ఫోన్‌లో మాట్లాడి గొడవ పడ్డాడు. ఈ క్రమంలో తనను దూరం పెడుతున్నావని, ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. 'నేను ఆత్మహత్య చేసుకుంటానంటూ' ఫోన్‌లో చెప్పి సెల్ స్విచాఫ్ చేశాడు. దీంతో సదరు యువతి సమీపంలో నివసిస్తున్న మరో స్నేహితుడికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. అతడు వచ్చి చూడగా.. లోపలి నుంచి గడియ పెట్టుకుని ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. అప్పటికే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పంచనామా నిర్వహించిన పోలీసులు మృతదేహన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు జారిపడి పెయింటర్ మృతి

అత్తాపూర్ : ప్రమాదవశాత్తు కాలుజారి ఓ పెయింటర్ మృతి చెందిన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అత్తాపూర్ ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... ఉమ్మడి పాలమూరు జిల్లాపెద్ద కార్పాముల గ్రామానికి చెందిన నాగపురి రాములు (35) ఓల్డ్ సిటీ ఉప్పుగూడలో నివాసముంటున్నారు. ఇటీవలే మూడేళ్ల కుమారుడు అవినాష్ అనారోగ్యంతో మృతి చెందాడు. మానసికంగా ఆందోళనతో ఉన్న అతడు కుటుంబ పోషణలో భాగంగా గత పది రోజులుగా పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే -172 పిల్లర్ సమీపంలోని ఓ బహుళ అంతస్తుల నిర్మాణంలో పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం పెయింటింగ్ వేస్తున్న క్రమంలో అతడి జేబులో ఉన్న సెల్‌ఫోన్ కిందపడిపోయింది. ఆ ప్రయత్నంలో కాలుజారి 5వ అంతస్తు నుంచి కిందపడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో హిందీ విభాగంలో యూజీ, పీజీ కోర్సులు, పార్ట్‌టైమ్ పీజీ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలను కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మనూ' హిందీ విభాగం హెడ్ డాక్టర్ జీ.వీ. రత్నాకర్ తెలిపారు. 'మనూ' హిందీయేతర ప్రాంతాల్లో హిందీ భాష, సాహిత్యాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. హిందీ, ఉర్దూ, దఖినీ భాషలు, సంస్కృతిలో అధ్యయనాలు, పరిశోధనల ఇంటర్ డిసిప్లినరీ విధానాలపై డిపార్ట్‌మెంట్ దృష్టి పెట్టిందన్నారు. హిందీ విభాగం తన పాఠ్యాంశాల ద్వారా సాహిత్యంతోపాటు ఫంక్షనల్ హిందీ, ఇతర అనువాద సంబంధిత కోర్సులను అందించడం ద్వారా విద్యార్థులను ప్రోత్సహిస్తుందన్నారు. మెరిట్ ఆధారిత కోర్సు ఎంఏ హిందీలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ దరఖాస్తును సమర్పించడానికి జూన్ 30 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7013507228 (డాక్టర్ జీవీ రత్నాకర్)ను సంప్రదించాలని ఆయన కోరారు.


బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం



మణికొండలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు


మణికొండ: చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ప్రతి మండలం, గ్రామం, మున్సిపాలిటీ అభివృద్ధికి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌నే గెలిపించాలని గండిపేట మండల బీఆర్‌ఎస్ పార్టీ సమన్వయకర్త, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్ అన్నారు. బుధవారం ఆయన మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ధన్‌రాజ్‌లతో కలిసి మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి అన్ని రంగాల్లో అభివృద్ధి, పేదలకు సంక్షేమాన్ని అందించిన పార్టీ బీఆర్‌ఎస్ అన్నారు. అమలు సాధ్యం కాని అనేక పథకాలను హామీలుగా ఇచ్చి ఒక్క పథకాన్ని సరిగ్గా అమలు చేయలేని పరిస్థితి కాంగ్రెస్‌ది అన్నారు. అలాంటి పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్సీ, బీసీ ఉద్యమ నాయకుడిగా కాసాని ఎన్నో సేవలు చేశారన్నారు. అలాంటి వ్యక్తిని గెలిపించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కౌన్సిలర్ శైలజ, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు నరేందర్, లక్ష్మీశ్రీ, విఠల్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ ఎర్రబోడాలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు ఓటువేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పోరెడ్డి ధర్మారెడ్డి మాట్లాడుతూ... కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. నాయకులు బండ్ల నరేందర్, సయ్యద్ ఉల్ జమిల్, నరేష్, గిరిబాబు, శ్రీవర్ధన్‌రెడ్డి, సుజాత, జాబిన్, సత్య, శివకృష్ణ, శ్రీనివాస్, సందీప్‌రెడ్డి, సాయికిరణ్, అశ్వక్, నరేశ్, రామ్‌ప్రకాష్‌గౌడ్, అకిరానందన్, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మణ్, ఆనంద్‌గౌడ్, రంజన్, తపోజిల్, తనీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లలో బీజేపీని గెలిపించాలి : మందకృష్ణ మాదిగ

రాజేంద్రనగర్: ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంతో చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం కృషిచేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ సూచించారు. రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ ఆవరణలో మంగళవారం రాత్రి బీజేపీ నాయకులు, ఎమ్మార్పీఎస్ ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. క్లబ్ ఆవరణలో బహిరంగసభ నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు చేయగా.. భారీ వర్షంతో సభ రద్దయింది. దీంతో ఆయన ముఖ్య నాయకులు, కార్యకర్తలో సమావేశం నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మార్పీఎస్ నాయకులు సమన్వయం చేసుకుంటూ.. పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతి ఇంటికి వెళ్లి బీజేపీ సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ప్రచారం నిర్వహించాలన్నారు. మల్లారెడ్డి, బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుగల బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నరసింహా, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు క్యాసారం శంకర్‌రావు, జాతీయ నాయకులు మద్దిలేటి మాదిగ, వనం నరసింహామాదిగ, బీజేపీ రాజేంద్రనగర్ కన్వీనర్ మల్లేష్, వికారాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మల్లికార్జున్‌మాదిగ, రాష్ట్ర నాయకులు ఎం.రత్నం, ఆర్.ఎస్.రమేష్ మాదిగ, జిల్లా నాయకులు చిట్టిబాబు, రవి, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి



అన్నదానంలో పాల్గొన్న వాసవి అసోసియేషన్ సభ్యులు

మణికొండ: సమాజంలో నిరుపేదలకు చేసే సేవా కార్యక్రమాలు ఎంతో సంతృప్తినిస్తాయని మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి అన్నారు. బుధవారం అమావాస్య సందర్భంగా అలకాపూర్ టౌన్‌షిప్‌లోని అసోసియేషన్ కార్యాలయం వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలోనే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ప్రతి అమావాస్య రోజు పేదలకు అన్నదానం చేస్తున్నామన్నారు. ఆకలితో ఉన్న వందలాది మందికి భోజనం పెట్టడం సంతోషంగా ఉందన్నారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ విభాగం అస్తవ్యస్తంగా తయారైందని జిల్లా కలెక్టర్ శశాంకకు పట్టణానికి చెందిన సామాజిక సేవకులు జీ.బి. పాపారాయుడు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని బీసీ హాస్టల్ సమీపంలో జీవో 111 నిబంధనలకు విరుద్ధంగా భారీ అక్రమ సెల్లార్ పనులు కొనసాగుతున్నా.. టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ అక్రమ కట్టడాన్ని పరిశీలించినా.. అక్రమార్కులు యథాతథంగా పనులు కొనసాగించడంపై పలు విమర్శలకు తావిస్తోంది. రెవెన్యూ విభాగం నుంచి వచ్చిన ప్రభుత్వ ఉద్యోగులను కీలక విభాగాల్లో నియమించకుండా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి మాత్రమే పెత్తనం ఇవ్వడంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పట్టణానికి పూర్తిస్థాయి టౌన్‌ప్లానింగ్ అధికారిని కేటాయించాలని కోరారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర తెలిపారు. మే 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు పోలింగ్‌స్టేషన్‌లను ఆయన పరిశీలించారు. గంధంగూడ ప్రభుత్వ పాఠశాల, డిస్కవరీ స్కూల్, హైదర్షాకోట్‌లోని ప్రభుత్వ పాఠశాల, పీరంచెరువు ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. శానిటేషన్ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్‌చైర్స్ కూడా అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ప్రజలంతా సక్రమంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు రామాంజులు, మల్లేష్, కృష్ణ, వెంకటేష్, సుభాష్, రాము తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సురేష్‌గౌడ్

బండ్లగూడ: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటికి పరిష్కారాలు చూపిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ గోకరి శ్రీలతాసురేష్‌గౌడ్ అన్నారు. 18వ డివిజన్ ధాత్రి కాలనీ, ఆనంద్ ఎన్‌క్లేవ్‌లో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. రోడ్ల పైకి మట్టి చేరుకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాసేవ చేసేందుకు తమవంతు బాధ్యత వహిస్తున్నామన్నారు. వర్షాలకు రోడ్డుపైకి మట్టిచేరి వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీంతో వెంటనే తాను జేసీబీతో పేరుకుపోయిన మట్టి కుప్పలను తొలగింపజేశామన్నారు. ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

నియామకం



రాజేంద్రనగర్: బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ గిరిజన మోర్చా అధ్యక్షుడు కేతావత్ ప్రకాష్‌నాయక్ అధ్యక్షతన రాజేంద్రనగర్ గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శిగా బుద్వేల్ గ్రామానికి చెందిన కేతావత్ సిద్దు నాయక్, రాజేంద్రనగర్ గిరిజన మోర్చా ఉపాధ్యక్షుడిగా ఉప్పర్‌పల్లికి చెందిన కేతావత్ శివకుమార్ నాయక్‌లు నియమితులయ్యారు. రాష్ట్ర కార్యవర్గసభ్యులు అంజన్‌కుమార్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, డివిజన్ అధ్యక్షుడు బాబురావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్‌గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి బండారి బాలకృష్ణ, బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో గిరిజన ప్రజలందరూ కలిసి బీజేపీకి ఓటువేసి మరోసారి మోదీని ప్రధానమంత్రిగా గెలిపించాలని కోరారు.